
# దూరంతో భారం 4000 కోట్లు

## పైప్‌లైన్ దూరం.. అంచనా వ్యయం పెంచి హైదరాబాద్‌కు నీళ్లట!






## అసంబద్ధ వాదనలు వినిపిస్తున్న ప్రభుత్వం

**1** కొండపోచమ్మసాగర్ సామర్థ్యం 15 టీఎంసీలైతే, మల్లన్నసాగర్ సామర్థ్యం 50 టీఎంసీలు. నిల్వ ఎక్కువగా ఉంటున్నందున మల్లన్నసాగర్‌ను ఎంచుకున్నట్టు ప్రభుత్వం చెప్తున్నది.

వాస్తవానికి హైదరాబాద్ తాగునీటి అవసరాలకు ప్రస్తుతం ఎల్లంపల్లి జలాశయం నుంచి రోజూ తీసుకుంటున్న నీటి పరిమాణం 331 క్యూసెక్కులు. ఏడాదికి పది టీఎంసీలు. ఒకవేళ 20 టీఎంసీల కోసమైతే 662 క్యూసెక్కులు. ఇంత చిన్న పరిమాణంలో నీటిని తీసుకునేందుకు 15 టీఎంసీల సామర్థ్యం ఉన్న కొండపోచమ్మసాగర్ సరిపోదా?

ప్రభుత్వం చెప్తున్న లాజిక్‌ను ప్రామాణికంగా తీసుకుంటే.. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీటిని కొండపోచమ్మ సాగర్‌కు ఒక దశ లిఫ్టు ద్వారా ఎత్తిపోస్తారు. అంటే కొండపోచమ్మసాగర్ నుంచి హైదరాబాద్‌కు నీళ్లు తీసుకోవడం వల్ల అందులో ఉండే 15 టీఎంసీలతో పాటు దానికి దిగువన ఉన్న మల్లన్నసాగర్‌లోని 50 టీఎంసీల నిల్వ కూడా భరోసాగా ఉంటుంది. కొండపోచమ్మలో నీళ్లు తగ్గుముఖం పట్టగానే మల్లన్నసాగర్ నుంచి లిఫ్టు చేసుకోవచ్చు. దీని ద్వారా హైదరాబాద్‌కు 65 టీఎంసీల నీటి భరోసా ఉంటుంది. కానీ మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు నీటిని తీసుకోవడం వల్ల కొండపోచమ్మ నుంచి మల్లన్నసాగర్‌కు నీటిని తరలించే వెసులుబాటే లేదు.



20 టీఎంసీల తరలింపు కోసం అంచనా వ్యయాన్ని ఏకంగా రూ.7,300 కోట్లుగా నిర్ధారించారు. ఇందు కోసం మల్లన్నసాగర్ నుంచి రెండు వరుసల పైప్‌లైన్ (3వేల డయా చొప్పున) వేయాలని నిర్ణయించారు.



ఎక్కడ వెయ్యి కోట్లు... ఎక్కడ ఆరువేల కోట్లు...

**2** ఎత్తిపోతల (లిఫ్టు) ఖర్చును దృష్టిలో పెట్టుకొని మల్లన్నసాగర్‌ను ఎంచుకున్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది.



వాస్తవ విరుద్ధంగా ఉన్న ఈ ప్రభుత్వ వాదనపై ఇంజినీరింగ్ నిపుణులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కొండపోచమ్మ నుంచి ఘన్‌పూర్‌కు గ్రావిటీపైనే జలాల తరలింపు ఉంటుందని చెప్పిన జలమండలి అధికారులు ఇప్పుడు కొండపోచమ్మ సాగర్ నుంచి కొంత ఎత్తులో నీటిని లిఫ్టు చేయాల్సి ఉండేదని ఇప్పుడు చెప్తున్నారు. జలమండలి అధికారులు ఇప్పుడు విడుదల చేసిన మ్యాప్ ప్రకారం కొండపోచమ్మ దగ్గర నీటిని తీసుకునే లెవల్ 592 మీటర్లు కాగా... ఘన్‌పూర్ లెవల్ 595 మీటర్లు. అంటే చిన్నపాటి లిఫ్టుతో జలాలను తరలించవచ్చు. కానీ మల్లన్నసాగర్ వద్ద నీటిని తీసుకునే లెవల్ 519 మీటర్లు. అంటే ఉజ్జాయింపుగానే 76 మీటర్ల వరకు నీటిని లిఫ్టు చేయాలి. మరి తక్కువ లిఫ్టుతో భారమా? ఎక్కువ లిఫ్టుతో భారమా?

ఇప్పటికే జలమండలి వివిధ వనరుల నుంచి నీటిని తరలించేందుకు ఏడాదికి రూ.500 కోట్ల వరకు కరెంటు బిల్లులు చెల్లిస్తున్నది. ఇప్పుడు గోదావరి రెండో దశలో కూడా భారీ లిఫ్టులు పెట్టడం వల్ల జలమండలిపై కరెంటు బిల్లుల భారం మరింత పెరగనున్నది. ఈ క్రమంలో మల్లన్నసాగర్‌ను ఎంచుకోవడం వల్ల అటు అంచనా వ్యయంతో పాటు ఏటా నిర్వహణ భారం కూడా పెరగనుంది.

**వ్యాప్కోస్ పేరిట కాంగ్రెస్ సర్కార్ అసంబద్ధ వాదనలు**

**మల్లన్నసాగర్ నుంచి ఎత్తిపోతలతో నష్టమే తప్ప లాభం లేదు**

- కొండపోచమ్మ నుంచైతే 65 టీఎంసీల భరోసా అంటున్న నిపుణులు
- కేవలం వెయ్యి కోట్లతో 10 టీఎంసీలకు కేసీఆర్ సర్కార్ ప్రతిపాదనలు
- 20 టీఎంసీలు తరలించాలంటే రూ.2 వేల కోట్ల ఖర్చు మాత్రమే
- ఏకంగా అంచనా వ్యయాన్ని 7,300 కోట్లకు పెంచిన రేవంత్ సర్కారు
- మల్లన్నసాగర్-ఘన్‌పూర్ మధ్య 100 మీటర్లకు పైగా ఎత్తిపోతలు
- కాస్ట్-బెనిఫిట్ రేషియోను విస్మరిస్తున్న అధికారులు, పాలకులు
- తాజా ప్రతిపాదనను సమర్థించలేక ఇరిగేషన్ ఇంజినీర్ల మల్లగుల్లాలు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 4 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగర తాగునీటి కోసం కాళేశ్వర జలాలను తరలించేందుకు కేసీఆర్ ప్రభుత్వం కొండపోచమ్మసాగర్ నుంచి నీటిని తీసుకోవాలని గతం లో నిర్ణయించింది. ప్రతిపాదనలు సిద్ధం చేయ గా కేవలం రూ.1006 కోట్లతో పది టీఎంసీల జలాలను 24 కిలోమీటర్ల దూరంలోని శామీర్‌పేట సమీపంలో ఉన్న ఘన్‌పూర్ వరకు తరలించవచ్చని అంచనాలు రూపొందించింది. అదే 20 టీఎంసీలు తరలించాలంటే రూ.2012 కోట్లు అవుతుంది.

కానీ తాజాగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రెండు రోజుల కిందట 24 కిలోమీటర్ల దూరంలోని కొండపోచమ్మ సాగర్ కాకుండా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన 50 కిలోమీటర్ల దూ రంలోని మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్ వరకు కాళేశ్వరజలాలను తరలించాలని నిర్ణయించింది. అంటే 26 కిలోమీటర్ల దూరం (దాదాపు రెట్టిం పు) పైప్‌లైన్ పొడగించారు. ఇదే కాదు.. మల్లన్నసాగర్‌కు మార్చడం వల్ల వంద మీటర్లకు పైగా నీటిని మోటర్లతో ఎత్తిపోయాల్సి వస్తుంది.

ఒకవైపు పైప్‌లైన్ పొడవు పెరిగి.. లిఫ్టు భారీగా పెరగడంతో అంచనా వ్యయం రూ.2 వేల కోట్ల నుంచి దాదాపు మూడు రెట్ల వరకు పెరిగినట్టు తెలుస్తున్నది. కొండపోచమ్మసాగర్ నుంచి నీళ్లు తీసుకున్నా, మల్లన్నసాగర్ నుంచి తీసుకున్నా హైదరాబాద్ మహా నగరానికి వచ్చే ప్రయోజనం ఒక్కటే. అలాంటప్పుడు కాస్ట్-బెనిఫిట్ రేషియోను విస్మరించడం వల్ల సర్కారు ఖజానాపై ఏకంగా రూ.4 వేల కోట్ల వరకు భారం పెరుగుతున్నట్టు సమాచారం. మరి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రతి చిన్న ప్రాజెక్టుకు కాస్ట్-బెనిఫిట్ (బీసీ) రేషియో అంటే పెట్టే ఖర్చు, వచ్చే ప్రతిఫలాన్ని బేరీజు వేసిన కాంగ్రెస్ పెద్దలు ఇప్పుడు మాత్రం ఆ అంశాన్నే పట్టించుకోకపోవడం వెనక మర్మమేమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

హైదరాబాద్ మహా నగరానికి భవిష్యత్తులోనూ మంచినీటి సమస్య తలెత్తకుండా ఉండటంతో పాటు మురికి కూపంగా మారిన మూసీని ప్రక్షాళన చేసేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను తరలించాలని గత కేసీఆర్ ప్రభుత్వమే నిర్ణయించింది. ఈ మేరకు కాళేశ్వరం పథకం రూపకల్పనలోనే ఇందుకు అన్నిరకాల వెసులుబాట్లు కల్పించింది. హైదరాబాద్ నగర తాగునీటి కోసం ఏటా 30 టీఎంసీల కేటాయింపును కాళేశ్వరం డీపీఆర్‌లోనే పొందుపరిచింది. కాగా ఎల్లంపల్లి జలాశయం నుంచి నగరానికి మొదటి దశలో గోదావరి జలాల తరలింపు కొనసాగుతున్నది. ఈ పథకం కింద ఏటా 10 టీఎంసీల జలాలను వాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రెండో దశలో కూడా మరో పది టీఎంసీల గోదావరి జలాలను తరలించి, హైదరాబాద్ మహా నగరవాసులకు అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను కూడా తయారు చేసింది. కాళేశ్వరం పథకంలో 15 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న కొండపోచమ్మ సాగర్ నుంచి గ్రావిటీపైనే ఈ జలాలను మేడ్చల్ జిల్లా శామీర్‌పేట సమీపంలోని ఘన్‌పూర్ వద్దకు తరలించి, శుద్ధి చేసిన నీటిని ప్రజలకు అందించే సాంకేతిక అంశాలన్నీ అందులో ఉన్నాయి. అందుకే కొండపోచమ్మసాగర్ నుంచి సాగునీటి కోసం నిర్మించిన 127 కిలోమీటర్ల సంగారెడ్డి కాల్వ డిజైన్‌లోనే హైదరాబాద్ తాగునీరు, మూసీ ప్రక్షాళన కోసం కాళేశ్వర జలాల మళ్లింపునకు ముందుచూపుతో చర్యలు చేపట్టారు.




ఇందుకోసం సంగారెడ్డి కాల్వ గరిష్ఠ వరద ప్రవాహ సామర్థ్యాన్ని అదనంగా 700 క్యూసెక్కులకు పెంచి 4,354 క్యూసెక్కుల నుంచి 5054 క్యూసెక్కుల సామర్థ్యంతో నిర్మించారు.

**అసంబద్ధ వాదనలు వినిపిస్తున్న ప్రభుత్వం...**

వ్యాప్కోస్ రూపొందించిన ప్రతిపాదనల మేరకు తాజా నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం చెబుతుండగా.. డిజైన్ మార్పునకు రెండు ప్రధాన కారణాలున్నట్టు రెండు రోజుల కిందట సీఎంవో నుంచి అధికారిక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

**ఎక్కడ వెయ్యి కోట్లు? ఎక్కడ ఆరువేల కోట్లు?**

కేవలం గ్రావిటీ ద్వారా నగరానికి రెండో దశ గోదావరి జలాల తరలింపు పథకాన్ని రేవంత్ ప్రభుత్వం పక్కన పెట్టింది. ఇంతకంటే మెరుగైన డిజైన్, తక్కువ వ్యయంతో పథకం రూపకల్పన చేస్తే బాగుండేది. కానీ గ్రావిటీని కాదని ఎత్తిపోతల డిజైన్ ఎంచుకోవడమే కాకుండా పైప్‌లైన్ దూరం పెంచి, అంచనాలూ పెంచింది. పైగా జలమండలిపై అదనంగా కరెంటు ఖర్చును కూడా మోపుతున్నది. 24 కిలోమీటర్ల దూరంలోని కొండపోచమ్మ సాగర్ నుంచి కాకుండా 50 కిలోమీటర్ల దూరంలోని మల్లన్నసాగర్ నుంచి 15 టీఎంసీలు తరలించాలని తొలుత నిర్ణయించి, ఈ మేరకు రూ.5,560 కోట్లతో జీవో కూడా జారీ చేశారు. తాజాగా ఇప్పుడు 20 టీఎంసీల తరలింపు కోసం అంచనా వ్యయాన్ని ఏకంగా రూ.7,300 కోట్లకు పెంచారు. ఇందుకోసం మల్లన్నసాగర్ నుంచి రెండు వరుసల పైప్‌లైన్ (3 వేల డయా చొప్పున) వేయాలని నిర్ణయించారు. కాగా ఘన్‌పూర్ నుంచి జంట జలాశయాలకు ఐదు టీఎంసీల తరలింపునకు ఉజ్జాయింపుగా రూ.1300 కోట్ల వరకు ఖర్చవుతుందని, మిగిలిన రూ.ఆరు వేల కోట్లు మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్‌కు 20 టీఎంసీల కాళేశ్వర జలాల తరలింపునకు ఖర్చవుతుందని రిటైర్డ్ ఇంజినీర్ తెలిపారు.

**ఇంజినీర్ల మల్లగుల్లాలు**

మల్లన్న సాగర్ నుంచి ప్రతిపాదన నీటి పారుదల శాఖ ఇంజినీర్లకు తలనొప్పిగా మారినట్టు తెలిసింది. ఈ పథకాన్ని జలమండలి చేపడుతున్నప్పటికీ మల్లన్నసాగర్, కొండ పోచమ్మ సాగర్ నీటిపారుదల శాఖ పరిధిలోకి వస్తుంది. కేసీయార్ హయాంలో కొండపోచమ్మ సాగర్ నుంచి నీటిని తీసుకునేందుకు డిజైన్ రూపొందించగా ఇప్పుడు మల్లన్నసాగర్‌కు మార్చారు. దీంతో మార్పు కారణాలను అందించాలని ప్రభుత్వం సూచించినట్లు తెలిసింది. గతంలో కొండ పోచమ్మను సమర్థించిన నీటి ఒరుదల శాఖ ఇప్పుడు మల్లన్న సాగర్‌ను సమర్థించాల్సి వస్తుంది. దీనిపై ఇంజనీర్లు మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలిసింది.

---

## టీపీవో వేధింపులు

- ఒంటిపై పెట్రోల్ పోసుకున్న బాధితుడు



నిర్మల్ అర్బన్, జనవరి 4 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట్ కాలనీకి చెందిన శక్కరి రమేశ్ అధికారుల వేధింపులు భరించలేక ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిరసన తెలిపాడు. వివరాల్లోకి వెళ్తే.. శక్కరి రమేశ్ ఇటీవల ఇంటి నిర్మాణం చేపట్టాడు. దీనికి అన్ని అనుమతులు తీసుకున్నా మున్సిపల్ టీపీవో హరీశ్ తరచూగా వచ్చి ఇంటి నిర్మాణానికి అనుమతులు లేవంటూ పనులు అడ్డుకోసాగాడు. మున్సిపల్ నుంచి అనుమతులు తీసుకున్నా అధికారులు పనులను అడ్డుకుంటున్నారని నిరసిస్తూ కార్యాలయం ఎదుట రమేశ్ కుటుంబసభ్యులతో కలిసి బైఠాయించాడు. అధికారులు వచ్చి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. అక్కడే ఉన్న పోలీసులు గమనించి వెంటనే పెట్రోల్ డబ్బాను లాక్కున్నారు. కమిషర్ ఖమర్‌అహ్మద్, చైర్మన్ ఈశ్వర్ వచ్చి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన సద్దుమణిగింది.

# తప్పుడు కేసులు.. కక్ష సాధింపులు?

మొదటిపేజీ తరువాయి...

అధికారులు తప్పుడు కేసులు పెడుతున్నారు. ఓ కాంగ్రెస్ నాయకుడు విసురుతున్న వలలో అధికారులు చిక్కుకుంటున్నారు. ఆయన చెప్పిందే వేదంగా చట్టాలను ఏమా త్రం పరిగణనలోకి తీసుకోకుండా కేసులు బనాయిస్తున్నారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బొల్లి రామ్మోహన్‌పై ముందుగా కేసు పెట్టి అరెస్టు చేశారు. అక్కడితో ప్రారంభమైన కేసుల పరంపర ఇంకా కొనసాగుతూనే ఉన్నది. మరికొంత మంది బీఆర్‌ఎస్ నాయకులపై కేసులు నమోదు చేసేందుకు పావులు కదుపుతున్నట్టు తెలుస్తున్నది. అయితే కాంగ్రెస్ నాయకుడి చేతిలో ఓ ఉన్నతాధికారి కీలుబొమ్మలా వ్యవహరిస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. బనాయిస్తున్న కేసులు నిబంధనలకు విరుద్ధమని తెలిసినా.. పై అధికారికి భయపడి కిందిస్థాయి అధికారులు తప్పుడు వివరాలు సమర్పిస్తున్నట్టు తెలుస్తున్నది. నిజానికి ఒక కేసు నమోదు చేసే ముందు నిజానిజాలు పరిశీలించాలి. సంబంధిత వ్యక్తికి నోటీసులు ఇవ్వాలి. విచారణ జరిపిన తర్వాత మాత్రమే చట్టపరమైన చర్యలకు ఉపక్రమించాలి. కానీ, ఇవేవి లేకుండానే కక్షపూరిత చర్యలకు దిగుతున్నారు. మచ్చుకు ఇటీవల అరెస్టు అయిన బొల్లి రామ్మోహన్ ఉదంతమే అధికారుల కక్ష సాధింపునకు ఓ నిదర్శనం.

**మరో తప్పుడు కేసు**

అలాగే సర్దాపూర్ పరిధిలోని 27/5 సర్వేనంబర్‌లో ఎకరం 20 గుంటలు అసైన్డ్ భూమి కొనుగోలు చేశారంటూ బొల్లి రామ్మోహన్‌పై మరో తప్పుడు కేసు నమోదు చేశారు. ఇక్కడ స్వాతంత్ర్య సమరయోధుడు అవునూరి పితాంబర్‌రావు అనే వ్యక్తికి 1964-65 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం 10.05 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. పితాంబర్‌రావు చనిపోవడంతో అతని కొడుకు వేణుగోపాల్‌రావుకు సదరు ఆస్తి సంక్రమించింది. ఆయన నుంచి బొమ్మవరం చంద్రశేఖర్‌రావు ఆ భూమిని కొనుగోలు చేశారు. బొమ్మవరం చంద్రశేఖర్‌రావు నుంచి (డాక్యుమెంట్ నంబర్ 2317/09) రామ్మోహన్ 2009లో కొనుగోలు చేశారు. నిబంధనల ప్రకారం ఈ తరహా అసైన్డ్ భూములను ప్రభుత్వ జీవో ఎంఎస్ నంబర్ రెవెన్యూ (అసైన్డ్-1) తేది 15-12-2008 ప్రకారం పది సంత్సరాల తదుపరి ఎవరికైనా విక్రయించుకోవచ్చని నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. ఈ ఉత్తర్వులన్నీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వచ్చినవే. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు, జీవోల ప్రకారమే రామ్మోహన్‌కు సబంధించిన భూముల లావాదేవీలు, క్రయ విక్రయాలు జరిగాయి. ఎక్కడా నిబంధనలకు విరుద్ధంగా లేదు. ఆక్రమణలు లేవు. ప్రతి దానికి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇచ్చిన ఉత్తర్వులు, ఎన్‌వోసీలున్నాయి. వాటిని అధికారులు ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. ఆశ్చర్యం ఏమిటంటే ఇదే భూమిలో రామ్మోహన్‌తోపాటు మరో ఐదుగురు మోఖాపై ఉన్నారు. కానీ, వారి భూములను రద్దు చేయలేదు. వారి కి కనీసం నోటీసులు ఇవ్వలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే వారి ప్రస్తావనను అధికారులు ఎక్క డా చూపలేదు. ఒకే సర్వే నంబర్‌లో రామ్మోహన్‌ది అక్రమం అయితే.. మిగిలిన వారిది కూడా అక్రమమే అవుతుంది కదా! ఈ లాజిక్‌ను సై తం అధికారులు విస్మరించి కేసులు నమోదు చేశారు. ఈ విషయంపై రామ్మోహన్ మాట్లాడుతూ.. అధికారులు తప్పుగా పేర్కొంటున్న ప్రతి భూమిని తాను చట్టబద్ధంగా కొనుగోలు చేశానని స్పష్టం చేశారు. అందుకే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నానని, తప్పుడు కేసులు పెట్టినవారితోపాటు తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారులపై న్యాయపరమైన చర్యలకోసం పోరాటం చేస్తానని చెప్పారు. ఓ ఉన్నతాధికారి ఒత్తిడికో లేక కాంగ్రెస్ నాయకుడి ఒత్తిడికో తలొగ్గి అధికారులు తప్పుడు కేసులు పెడితే.. న్యాయపరమైన చర్యలను సదరు అధికారులు ఎదుర్కోవాల్సి వస్తుందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు.

### కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే క్రయ విక్రయాలు

**సిరిసిల్ల** జిల్లా సర్దాపూర్ పరిధిలోని సర్వేనంబర్ 61లో 441 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. సర్వేనంబర్ 61/38లోని ఐదెకరాల స్థలాన్ని వికృతి ప్రభాకర్ ద్వారా.. (డాక్యుమెంట్ నంబర్ (4975/07) వినాయక స్టోన్‌క్రషర్ పేరుతో 2007లో బొల్లి రామ్మోహన్ కొనుగోలు చేశారు. వికృతి ప్రభాకర్ ఈ స్థలాన్ని (డాక్యుమెంట్ నంబర్ 4733/ 2007) వేముల రవీందర్ నుంచి కొనుగోలు చేశారు. నిజానికి వేముల రవీందర్ మాజీ సైనికోద్యోగి. ఆయనకు ప్రభుత్వం సర్వేనంబర్ 61/38లో ఐదు ఎకరాల స్థలాన్ని 1992లో (ఎమ్మార్వో సిరిసిల్ల ఆర్డీఎస్ 4474/92) ద్వారా ఇచ్చింది. నిబంధనల ప్రకారం పదేండ్లు దాటిన తర్వాత ఎక్స్‌సర్వీస్‌మెన్ తమ స్థలాన్ని ఇతరులకు విక్రయించుకోవచ్చు. వేముల రవీందర్ తన భూమిని అమ్మటం కోసం.. ఆనాడు సిరిసిల్ల ఎమ్మార్వో నుంచి (రెఫరెన్స్ నంబర్ బి/1271/2007 తేదీ: 5-11-2007) ఎన్‌వోసీ తీసుకున్నారు. ఆ సమయంలో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వమే లేదు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఎన్‌వోసీలు వచ్చాయి. ఆ సమయంలో బీఆర్‌ఎస్ నాయకుడిగా ఎటువంటి పత్రాలు సృష్టించడానికి ఆస్కారమే లేదు. రవీందర్ నుంచి కొనుగోలుచేసిన స్థలంలో 2007లో కంకర మిషన్ (స్టోన్‌క్రషర్)ను రామ్మోహన్ పెట్టారు. దీనికి రెవెన్యూ, గ్రామ పంచాయతీ, పోలీసుల శాఖ నుంచి ఎన్‌వోసీలున్నాయి. అలాగే ఫ్యాక్టరీ లైసెన్స్ ఉంది. మైన్స్ క్వారీ లీజు సర్టిఫికెట్ ఉంది. పొల్యూషన్, ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ ఉంది. అలాగే నిబంధనల ప్రకారం నాలా కన్వర్షన్ ఉంది. ఇన్ని ఉన్నా ఇప్పుడు అది ప్రభుత్వ భూమి అని, దానిని తప్పుడు పద్ధతుల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారంటూ అధికారులు తమ రిపోర్టులో పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం.. భూమిపై ఏదైనా ఫిర్యాదు వస్తే ముందుగా రెవెన్యూ అధికారులు విచారణ చేయాలి. నోటీసులు ఇవ్వాలి. విచారణ పూర్తి అయిన తర్వాత మాత్రమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. కానీ ఈ కేసులో కలెక్టరేట్ ఏవో నేరుగా సిరిసిల్ల టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం ఫిర్యాదు చేయడానికి ఏవోకు అర్హత ఉండదు. కానీ, పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా రామ్మోన్‌కు సిరిసిల్ల ఏవో ఎటువంటి నోటీసులు ఇవ్వలేదు. అంతేకాకుండా ఈ స్థలం అక్రమమంటూ.. ఆన్‌లైన్ నుంచి ప్రస్తుతం దాని వివరాలను రెవెన్యూ అధికారులు తొలగించారు. ఆన్‌లైన్ నుంచి తొలగించే ముందు.. రెవెన్యూ అధికారులు కచ్చితంగా భూ యజమానికి ముందుగా నోటీసులు ఇవ్వాలి. ఇక్కడ ఎటువంటి నిబంధనలను అధికారులు పాటించకపోవడం.. వారి కక్ష సాధింపునకు నిదర్శనంగా చెప్పవచ్చు. అలాగే, ఇదే కేసులో పోలీసులు కూడా ముందస్తుగా నోటీసులు ఇవ్వాలి. కానీ, వాళ్లు నిబంధనలను విస్మరించి, వాకింగ్ చేస్తున్న సమయంలో రామ్మోహన్‌ను అరెస్టు చేశారు.

### కాంగ్రెస్ నాయకుల చేతుల్లోనే అసైన్డ్ భూములు

నిజానికి కాంగ్రెస్ నాయకుల చేతుల్లో వేల ఎకరాల అసైన్డ్ భూములున్నట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలోనే బీఆర్‌ఎస్ నాయకులు వాటికి సంబంధించిన పూర్తి డాటా సేకరిస్తున్నారు. ఇప్పటికే చాలా వివరాలు సేకరించినట్టు తెలుస్తున్నది. అతి త్వరలోనే ఆ నిజాలన్నీ బయట పెట్టేందుకు కావాల్సిన ఏర్పాట్లను బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్నారు. 2009 నుంచి 2014 మధ్యలో కాంగ్రెస్ నాయకులు భారీగా అసైన్డ్ భూములు ఆక్రమించుకోవడమే కాదు, రికార్డులను తారుమారు చేసి, ఎంచక్కా అనుభవిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. మరికొంత మంది అమ్ముకొని, సొమ్ముచేసుకున్నారని తెలుస్తున్నది. అటువంటి వారిని వదిలి పెట్టి, నిజాయితీగా, చట్టబద్ధంగా కొనుగోలు చేసిన బీఆర్‌ఎస్ నాయకులపై కక్ష కట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ కేసులకు బలైంది కేవలం ఒక రామ్మోహన్ మాత్రమే కాదు, బీఆర్‌ఎస్ నాయకుడి ప్రతి అరెస్టు వెనుక కక్ష పూరిత చర్యలే కనిపిస్తున్నాయి. ఆ వివరాలను కూడా 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తేనున్నది.